క్లుప్తంగా

వైద్యుల సూచనలు పాటించాలి



పాన్‌గల్: గర్భిణులు వైద్యుల సూచనలు పాటించాలని పీహెచ్‌సీ డాక్టర్ నాగరాజు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో ప్రధానమంత్రి సురక్ష మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమగు వారికి ఉచితంగా మందులను పంపిణీ చేసినట్లు డాక్టర్ పేర్కొన్నారు. గర్భిణులు వైద్యుల సూచనలు పాటిస్తూ పౌష్టికాహారం, పండ్లు, ఆకుకూరలు క్రమం తప్పకుండా తీసుకోవాలన్నారు.

మైనార్టీల సంక్షేమానికి కృషి

కొత్తకోట: రాష్ట్రంలో మైనార్టీలు అభివృద్ధి చెందాలంటే కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమవుతుందని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు లతీఫ్, సలీంఖాన్, ముజీబ్, సుల్తాన్ అన్నారు. గురువారం పట్టణ కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో వారు మాట్లాడుతూ ముస్లింలకు 12శాతం రిజర్వేషన్ కల్పిస్తామని చెప్పిన సీఎం కేసీఆర్ అమలు చేయడంలో పూర్తిగా విఫలమయ్యారని ఎద్దేవా చేశారు. సయ్యద్ లాల్, తయ్యబ్ తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక

మదనాపురం: మండల కేంద్రానికి చెందిన వడ్డె రాజశేఖర్, ద్యారంగుల రమేష్, జగదీష్, బాలరాజు, రాజశేఖర్, విశ్వేశ్వర్ తమ అనుచరులతో కలిసి దేవరకద్ర కాంగ్రెస్ అభ్యర్థి జి మధుసూదన్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు.

కాంగ్రెస్‌లో చేరిన రాచాల

కొత్తకోట: బీసీ పొలిటికల్ జేఏసీ రాష్ట్ర చైర్మన్ రాచాల యుగంధర్‌గౌడ్‌తో పాటు రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి దాదాపు 1000మందికి పైగా నాయకులు టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ అంజన్‌కుమార్ యాదవ్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరుతున్న యుగంధర్‌గౌడ్‌కు అఖిల భారత యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనివాస్ కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో బ్రహ్మచారి, గోపాల గురుస్వామి, గిన్నె శ్రీనివాస్‌రెడ్డి, మునగారి కృష్ణ, అంజన్నయాదవ్, మహేందర్, శేఖర్‌రెడ్డి, కొండన్న తదితరులు ఉన్నారు.

పేదల బాగు కోసం..

వీపనగండ్ల: రాష్ట్రంలోని పేదలు బాగుపడాలంటే కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలని పీసీసీ ఉపాధ్యక్షుడు మల్లు రవి, మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. గురువారం రాత్రి సంగినేనిపల్లిలో ఏర్పాటు చేసిన రోడ్ షోలో వారు పాల్గొని ప్రసంగించారు. రాష్ట్రాన్ని ఇచ్చిన కాంగ్రెస్ పార్టీకి ఒకమారు అధికారాన్ని ఇస్తే బడుగు బలహీన వర్గాలతో పాటు నిరుద్యోగులు, రైతులను అన్ని రకాలుగా ఆదుకుంటామని వారు అన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు బీరయ్య యాదవ్, ఎంపీటీసీ ఇంద్రకంటి వెంకటేష్, రాముయాదవ్, రాము, పండెం విజయ భాస్కర్‌రెడ్డి, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలను విస్మరించొద్దు

పెబ్బేరు రూరల్: కాంగ్రెస్ అభ్యర్థి తూడి మేఘారెడ్డి పాత కాంగ్రెస్ కార్యకర్తలను విస్మరించే ప్రయత్నం చేస్తే అడ్డుకుంటామని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాములుయాదవ్ అన్నారు. గురువారం ఆయన కార్యకర్తలతో కలిసి మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో కాంగ్రెస్ అభ్యర్థి మేఘారెడ్డికి వ్యతిరేకంగా నిరసన తెలిపారు. పదేళ్లుగా పార్టీ కోసం కష్టపడిన కాంగ్రెస్ శ్రీరంగాపురం మండల, పట్టణ అధ్యక్షులకు సమాచారం ఇవ్వకుండా విస్తృతస్థాయి సమావేశాన్ని ఏర్పాటు చేయడం ఏమిటని ప్రశ్నించారు.

మద్యం పట్టివేత

ఎర్రవల్లిచౌరస్తా: ఆర్ గార్లపాడుకు చెందిన మహేష్ గురువారం తన ద్విచక్ర వాహనంపై మద్యం తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. పోలీసుల కథనం మేరకు.. మద్యం తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో ఇటిక్యాల పోలీసులు షేకుపల్లి రోడ్డులోని రైస్ మి ల్లు దగ్గర తనిఖీ నిర్వహించారు. దీంతో మ ద్యం తరలిస్తున్న మహేష్ బైక్‌ను తనిఖీ చేయగా 15 లీటర్ల మద్యం దొరికింది. దాని విలువ 41వేలు ఉంటుందని ఎస్‌ఐ అశోక్‌బాబు తెలిపారు.

పల్లెకు బస్సు ఏది..?



బెక్కెంకు వెళ్లే ప్రధాన రహదారి

- బస్సుల కోసం పల్లె ప్రజల ఎదురుచూపులు
- రోడ్లు ఉన్నా కల నెరవేరకపాయే!

చిన్నంబావి: పల్లె శాపమో అధికారుల కోపమో కానీ నేటికీ అనేక గ్రామాలు పల్లె వెలుగు బస్సులు ఎరగవు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి గ్రామానికి బస్సులు నడపాలనే ఉద్దేశ్యంతో మినీ బస్సులను ఏర్పాటు చేసింది.అయితే బస్సు ఎరుగని పల్లెలకు ఈ మినీ బస్సులు ఎంతగానో ఉపయోగపడేవి.అలాంటివి ఇప్పటి వరకు పల్లెలకు మాత్రం బస్సులు రావడం లేదు. అలాంటిది మండలంలోని గూడెం, బెక్కెం, బస్వాపురం, మియాపూర్, వెల్టూరు, చిన్నమారు గ్రామాలకు చాలా ఏళ్లుగా బస్సు ఎరగని గ్రామాలుగా మిగులుతున్నాయి. రూ.కోట్లు వెచ్చించి ఏర్పాటు చేసిన పక్కా రహదారుల్లో బస్సు ఎరుగని పల్లెలుండటం విశేషం. ఈ గ్రామాలు నుంచి తమ పంట ఉత్పత్తులు తరలించటం, అవసరమైన ఎరువులు తీసుకొని వెళ్లటం, విద్యార్థులు పట్టణ ప్రాంతాలకు వెళ్లి ఉన్నత చదువులు చదువుకోవటానికి తీవ్ర ఇక్కట్లు పాలవుతున్నారు.

ఒకప్పుడు వచ్చేవి

ఒకప్పుడు ఈ పల్లెలకు వెళ్లిన బస్సులు కూడా నేడు వెళ్లటం లేదు. ఐదేళ్ల క్రితం వరకు ఆయా గ్రామాలకు బస్సులు నడిపినా.. నేడు వాటిని రద్దు చేశారు. మండలంలోని పెద్దదగడ నుంచి వెలగొండ వరకు బీటీ రోడ్డు నిర్మాణం లేకపోవడంతో ఆయా గ్రామాల గుండా బస్సు సౌకర్యం నిలిపివేశారు. కానీ పెద్దదగడ, గూడెం, బెక్కెం, మియాపూర్, వెలగొండ గ్రామాల గుండా రోడ్డు నిర్మాణాలు పూర్తయినా బస్సు నడపడంలో ప్రజా ప్రతినిధులు, అధికారులు విఫలమయ్యారు. అదేవిధంగా మండల కేంద్రం నుంచి వెల్టూరు, చిన్నమారూర్ గ్రామాలకు పక్కా రోడ్డు సౌకర్యం ఉండి ఈ రూట్ల మీదుగా బస్సు సౌకర్యం కల్పించే అవకాశం ఉన్నా.. ఆర్టీసీ అధికారులు ఏనాడు ఆ దిశగా పరిశీలన చేయలేదు.

విద్యార్థుల అవస్థలు

మండలంలోని దాదాపు ఆరు గ్రామాలకు బస్సు సౌకర్యం లేకపోవడంతో ఉన్నత చదువులను చదవాల్సిన విద్యార్థులు మధ్యలోనే వదదిలివేయాల్సి వస్తుందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల సమయంలో హామీలు ఇస్తున్నారే తప్ప సమస్య పరిష్కారం దిశగా ఏ ఒక్కరూ ప్రయత్నం చేయడం లేదని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు.

బస్సు సౌకర్యం లేకపోడంతో..



చాలా ఏళ్లుగా మా గ్రామానికి బస్సు సౌకర్యం లేదని ఎన్నోసార్లు అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులను వేడుకున్నా ఎలాంటి స్పందన లేదు. ఎన్నికల సమయం వచ్చినప్పుడు మాత్రం ఇదిగో బస్సు అదిగో బస్సు అంటారు తప్పితే ఎలాంటి ప్రయోజనం లేదు. ఉన్నత చదువులు చదవాలంటే పట్టణాలకు వేళ్లేందుకు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం.

– నూకల మహేష్, బెక్కెం గ్రామం

పది కి.మీ నడవాలి



ఏళ్లుగా మాకు బస్సు కలగానే మిగిలిపోయింది. నిత్యావసర సరుకులు కొనుగోలు చేయాలన్న, పంట ఉత్పత్తులను సంతకు తీసుకెళ్లాలన్న పది కి.మీ ప్రయాణం చేయాల్సిన దుస్థితి ఉంది. ఇన్ని రోజులు రోడ్లు బాగాలేదని బస్సును ఏర్పాటు చేయలేదు. పక్కా రోడ్డు పూర్తయి నాలుగేళ్లు అవుతున్నా ఇప్పటికీ బస్సు సౌకర్యం ఏర్పాటు చేయలేకపోవడం పాలకుల నిర్లక్ష్యం కనిపిస్తుంది.

– రాముడు, బెక్కెం

వెయ్యి జాకీలు పెట్టిలేపినా అంతే!

వనపర్తి: నాగర్‌కర్నూల్ పార్లమెంట్ పరిధిలోని నాలుగు సెగ్మెంట్లలో బీఆర్‌ఎస్ తిరస్కరించిన నాయకులకు టికెట్‌లు ఇచ్చిన కాంగ్రెస్ వెయ్యి జాకీలు పెట్టి లేపినా.. లేచే పరిస్థితి లేదని వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ అన్నారు. మూడోసారి రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వమే ఏర్పడుతుందని జోస్యం చెప్పారు. గురువారం ఎద్దుల బండిపై కలెక్టరేట్‌కు వెళ్లి నామినేషన్ దాఖలు చేసిన ఆయన జిల్లా కేంద్రంలోని రాజీవ్‌చౌక్‌లో మాట్లాడుతూ నియోజకవర్గంలో నలభై ఏళ్లుగా పార్టీ కోసం పనిచేసిన మాజీ డాక్టర్ జి.చిన్నారెడ్డిని కాదని ఆ పార్టీ నలభైరోజుల క్రితం డబ్బు ఇచ్చిన వ్యక్తికి టికెట్ ఇచ్చినప్పుడే కాంగ్రెస్ విలువ కోల్పోయిందన్నారు.

సీఎంఆర్‌ఎఫ్‌లు అందుకోవడంలో టాప్

సీఎం కేసీఆర్ సొంత నియోజకవర్గం గజ్వేల్ కంటే ఎక్కువగా వనపర్తి నియోజకవర్గానికి సీఎం సహాయనిధి నిధులు తీసుకొచ్చానని మంత్రి ఈ సందర్భంగా వెల్లడించారు. దక్షిణ తెలంగాణలో వనపర్తి జిల్లాను అభివృద్ధిలో అగ్రగామిగా నిలిపి చూపించాన్నారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి, మాజీ రాజ్యసభ సభ్యుడు రావుల చంద్రశేఖర్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయాల సంస్థ చైర్మన్ లక్ష్మయ్య, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు గట్టుయాదవ్, వాకిటి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.



గట్టుకాడిపల్లి లక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న మంత్రి నిరంజన్‌రెడ్డి

గట్టుకాడిపల్లిలో పూజలు

ఖిల్లాఘనపురం: మండలంలోని గట్టుకాడిపల్లిలో వెలిసిన లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డితో పాటు ఆయన సతీమణి సింగిరెడ్డి వాసంతి కుమార్తెలు, అల్లుళ్లతో కలిసి కుటుంబ సమేతంగా వచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వనపర్తి నియోజక వర్గం నుంచి బీఆర్‌ఎస్ అభ్యర్థిగా నామినేషన్ వేసే పత్రాలను స్వామి వారి పాదాల వద్ద ఆశీర్వదించాలని వేడుకున్నారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు

కొత్తకోట రూరల్: మండలంలోని పామాపురంలో గల అభయ అంజనేయస్వామి ఆలయంలో ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి బీ ఫాం ఉంచి కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. 2014, 2018 ఎన్నికల్లో నామినేషన్ వేసే ముందు ఈ ఆలయంలోనే పూజలు చేశారు. కార్యక్రమంలో జెడ్పీవైస్ చైర్మన్ వామన్‌గౌడ్, కాటం ప్రదీప్‌కుమార్‌గౌడ్, ఎంపీపీ గుంత మౌనిక, సీడీసీ చైర్మన్ చెన్నకేశవరెడ్డి, గాడీల ప్రశాంత్, చీర్లనాగన్నసాగర్, రాములుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.



బీ ఫాం నింపుతున్న ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

బీఆర్‌ఎస్‌లో చేరికలు

కొత్తకోట రూరల్: కొత్తకోట మండల పార్టీ అధ్యక్షుడు నరోత్తంరెడ్డితో పాటు 180 మంది గురువారం బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో రాఘవేందర్‌గౌడ్, జనార్దన్‌గౌడ్, రాజేశ్వరి, గోపాల్, మహేష్, ఆనంద్‌గౌడ్, శ్రావణ్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీసీ సీఎం చేస్తాం

ఆత్మకూర్: మున్సిపాలిటీలోని వార్డులతో పాటు మండలంలోని గ్రామాల్లో బీజేపీ నాయకులు మక్తల్ అభ్యర్థి మాదిరెడ్డి జలంధర్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో మెజారిటీ స్థానాలు సాధిస్తే బీజేపీ బీసీ నాయకుడిని సీఎంగా చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో అశ్విన్‌కుమార్, మహేశ్వరి, నాగలక్ష్మి, నాగేందర్‌రెడ్డి, శివశంకర్, ఆనంద్, చిన్ననర్సింహ, విష్ణురెడ్డి తదితరులు ఉన్నారు.

క్షేత్రస్థాయిలో విద్యార్థులకు శిక్షణ

పెబ్బేరు రూరల్: ఆధునిక వ్యవసాయ పద్ధతులపై మల్లారెడ్డి వ్యవసాయ కళాశాల విద్యార్థులకు కృషి విజ్ఞాన కేంద్రం మదనాపురం వారి ఆధ్వర్యంలో క్షేత్రస్థాయిలో శిక్షణ తరగతులు నిర్వహించారు. వారికి గురువారం మండలంలోని గుమ్మడంలో అనుభవజ్ఞులైన రైతుల నుంచి విత్తనం నాటిన నాటి నుంచి పంట కోత వరకు వ్యవసాయ మెలకువలను విద్యార్థులకు వివరించారు. అంతే కాకుండా కళాశాల నేర్పిన బోధన, పరిశోధన ఫలితాలను వ్యవసాయంలో మరింత అభివృద్ధి పొందడానికి ఆధునిక సాంకేతిక పద్ధతులను ఎలా అనుసరించాలని రైతులతో కలిసి చర్చించారు. కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్తలు రాజేందర్‌రెడ్డి, సురేష్‌కుమార్, భవాని ఆధ్వర్యంలో వ్యవసాయ కళాశాల విద్యార్థులు శిక్షణ పొందుతున్నారు.



రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

అడ్డాకుల: మూసాపేట మండలం కొమిరెడ్డిపల్లి శివారులోని జాతీయ రహదారిపై గురువారం రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయి. హైదరాబాద్‌కు చెందిన విజయమోహన్‌రెడ్డి భార్యతో కలిసి కారులో కర్నూల్‌కు వెళ్తున్నాడు. మార్గమధ్యలో కొమిరెడ్డిపల్లి దాటిన తర్వాత మలుపు వద్ద కారు అదుపు తప్పి డివైడర్ మీదుగా హైదరాబాద్ వెళ్లే పక్క రోడ్డు మీదకు దూసుకెళ్లింది. ఆ రోడ్డుపై వెళ్తున్న లారీ కారుకు తగలడంతో కారు మళ్లీ డివైడర్ మీదకు వచ్చి ఆగిపోయింది. అందులో ఉన్న విజయమోహన్‌రెడ్డికి స్వల్ప గాయాలయ్యాయి. ఘటనా స్థలానికి చేరుకున్న ఎల్‌అండ్‌టీ అంబులెన్స్ సిబ్బంది క్షతగాత్రుడికి అక్కడే ప్రథమ చికిత్స చేశారు. తర్వాత కారును అక్కడే వదిలేసి వారిద్దరు టోల్‌గేట్ వద్ద బస్సులో కర్నూల్‌కు వెళ్లిపోయారు.

ఎర్రవల్లిచౌరస్తా: జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలైన ఘటన కోదండాపురం పీఎస్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ కృష్ణదేవా కథనం మేరకు.. గద్వాల మండలంలోని పూడూరుకు చెందిన పరశు పని నిమిత్తం తన ద్విచక్ర వాహనంపై కర్నూల్‌కు వెళ్లాడు. పని ముగిసిన అనంతరం తిరిగి స్వగ్రామానికి బయలు దేరాడు. ఈ క్రమంలో జాతీయ రహదారిపై వేముల స్టేజీ సమీపంలో కర్నూల్ నుంచి హైదరాబాద్ వెళ్తున్న కారు పక్కనుంచి బైక్‌కు తగలడంతో బోల్తాపడి అతనికి తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు అతన్ని అంబులెన్స్‌లో కర్నూల్‌కు తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

అకాల వర్షంతో రైతన్న ఆగం

ఖిల్లాఘనపురం: మండలంలో బుధవారం రాత్రి కురిసిన వర్షానికి చేతికి వచ్చిన వరి పంటలు నేలకొరిగి రైతులు తీవ్ర నష్టాలకు గురయ్యారు. సాయంత్రం వరకు జాడలేని వరుణుడు రాత్రికి పెద్ద ఎత్తున కురవడంతో వరి పంటలు నేలకొరగడంతో పాటుగా కోతలు పూర్తి చేసుకుని కల్లాల్లో ఆరబోసిన ధాన్యం వర్షం నీటిలో తడవడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంట కళ్ల ముందే నేలకొరగడంతో కొందరు రైతులు కంటతడి పెట్టారు. ఎండలు ఉన్నాయి కదా అని కొందరు రైతులు పంటలను కోసి కల్లాల్లో ఆరబోసిన ధాన్యం వర్షంలో తడవడంతో కుటుంబ సభ్యులంతా వర్షంలోనే ధాన్యాన్ని దగ్గరకు చేర్చి కవర్లు కప్పారు. ధాన్యం తడిసి ఎక్కడ మొలకెత్తుతుందోనని రైతులు వాపోతున్నారు. మండలంలో ఇప్పటివరకు కేవలం 5 గ్రామాల్లోనే వరి కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. మిగతా గ్రామాల్లో కేంద్రాలు ఇంకా ప్రారంభించలేదు.



ఖిల్లాఘనపురం సమీపంలో ఆరబెట్టిన ధాన్యం నానడంతో దిగాలుగా కూర్చున్న రైతు



ఖిల్లాఘనపురం మండలం రోడ్డుమీదితండా సమీపంలో నేలకొరిగిన వరి పంట

పోలింగ్ కేంద్రాల్లో వసతులను పరిశీలన

వీపనగండ్ల: మండల కేంద్రంలోని పోలింగ్ బూత్‌లను గురువారం సెక్టోరియల్ అధికారి రవినా రాయణ, ఎంపీడీఓ కతలప్ప పరిశీలించారు. పోలింగ్ కేంద్రంలో విద్యుత్ వసతితో పాటు మూత్రశాలలు, తాగునీరు తదితర వసతులను స్థానిక బీఎల్‌ఓలను అడిగి తెలుసుకున్నారు. పోలింగ్ బూత్‌లో పనిచేసేందుకు వచ్చే అధికారులకు అన్ని వసతులను సమకూర్చాలని వారు బీఎల్‌లను ఆదేశించారు. కార్యక్రమంలో చిన్నంబావి ఏపీఓ ధనుంజయ, పంచాయతీ కార్యదర్శి నరేష్‌గౌడ్, హెచ్‌ఎంలు మంజుల, నాగేశ్వరమ్మ, బిఎల్‌ఓలు సుగుణాబాయ్, సువర్ణ, మహేశ్వరి, ఎల్లమ్మ, కమల తదితరులు పాల్గొన్నారు.



వసతులను పరిశీలిస్తున్న అధికారులు

రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు విద్యార్థిని ఎంపిక



సాయిశృతిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌చారి, ఉపాధ్యాయ బృందం

కొత్తకోట రూరల్: మండలంలోని అమడబాకుల సమీపంలో గల మోడల్ స్కూల్‌లో పదో తరగతి చదువుతున్న విద్యార్థిని జి.సాయిశృతి రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌చారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు ఈనెల 8న జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలో నిర్వహించిన అండర్–17 విభాగంలో, అక్టోబర్ 11న గద్వాలలో నిర్వహించిన అండర్–19 బాలికల విభాగంలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయిలో జరిగే క్రికెట్ పోటీలకు ఎంపికైంది. తమ పాఠశాల నుంచి మొట్టమొదటి సారిగా బాలికల విభాగంలో రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీల్లో పాల్గొనేందుకు సాయిశృతి ఎంపిక కావడంతో పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ నరేష్ కుమార్, పీఈటీలు ఆంజనేయులు, రాధిక, ఉపాధ్యాయ బృందం ఆనందం వ్యక్తం చేస్తూ విద్యార్థినిని అభినందించారు.

కురుమూర్తికి తరలివస్తున్న వ్యాపారులు



కురుమూర్తి జాతర మైదానంలో ఏర్పడ్డ హోటళ్లు



జాతరమైదానంలో ఏర్పాటు చేస్తున్న రంగుల రాట్నాలు

చిన్నచింతకుంట: కురుమూర్తి స్వామి బ్రహ్మోత్సవాలు ఈ నెల 14న ప్రారంభం కానున్నాయి. బ్రహ్మోత్సవాలతోపాటు జాతర నెలరోజులపాటు వైభవంగా కొనసాగుతుంది. ఉత్సవాలను పురస్కరించుకుని జాతర మైదానంలో వివిధ రకాల వ్యాపారాలు కొనసాగించేందుకు తెలంగాణతో పాటు కర్ణాటక, మహారాష్ట్ర, ఆంధ్ర ఇతర ప్రాంతాల నుంచి వ్యాపారస్తులు తరలివస్తున్నారు. మైదానంలో దుకాణ సముదాయాలను ఏర్పాటు చేసుకుంటున్నారు. ఇప్పటికే రంగుల రాట్నాలు, సర్కస్, హోటళ్లు, ఆట వస్తువులు, మిఠాయి తదితర దుకాణాలు ఏర్పాటు చేస్తున్నారు. ఉద్దాల మహోత్సవం నాటికి జాతర మైదానంలో దుకాణ సముదాయాల ఏర్పాట్లు పూర్తి కానున్నాయి.

సంక్షేమ పథకాలే గెలిపిస్తాయి



ఎంపీ రాములు, ఎమ్మెల్యే బీరం సమక్షంలో పార్టీలో చేరుతున్న కాంగ్రెస్ నాయకులు

కొల్లాపూర్ రూరల్: సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలే బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థులను గెలిపిస్తామని నాగర్‌కర్నూల్ ఎంపీ పి. రాములు అన్నారు. గురువారం మండలంలోని ఎన్మన్‌బెట్లలో ఎంపీ రాములు, ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి సమక్షంలో వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు 250 మంది బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ప్రతిపక్ష నాయకులు ఎన్ని ఎత్తుగడలు వేసినా సీఎం కేసీఆర్ తెలంగాణకు చేసిన అభివృద్ధిలో కొట్టుకపోతారన్నారు. సందర్భంగా ఎమ్మెల్యే బీరం మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో మరోసారి ఎమ్మెల్యేగా గెలిపించాలని ఓటర్లను కోరారు. అంతకు ముందు ఎంపీ, ఎమ్మెల్యేకు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అలుగు పారుతున్న రామయ్య చెరువు



అలుగు పారుతున్న రామయ్య చెరువు

అడ్డాకుల: మండలంలోని కందూర్ శివారులో ఉన్న రామయ్య చెరువు అలుగు పారుతుంది. కల్వకుర్తి ఎత్తిపోతల ద్వారా ఖిల్లాఘనపురం మీదుగా కాల్వ ద్వారా వచ్చే కృష్ణా జలాలు కొన్నాళ్ల నుంచి చెరువులోకి వస్తున్నాయి. కేఎల్‌ఐ కాల్వ ద్వారా వచ్చే నీళ్లు జగ్గాయపల్లి నుంచి కొత్తగా తవ్విన కాల్వలో చౌట చెరువుకు వస్తున్నాయి. ఆ చెరువు నిండి దిగువన ఉన్న శనిగె చెరువుకు రావడంతో అది కూడా నిండి దాని దిగువన ఉన్న రామయ్య చెరువులోకి చేరుతున్నాయి. ఈక్రమంలో గురువారం చెరువు నిండి అలుగు పారింది. దీంతో ఆయకట్టు రైతులు సంతోషం వెలిబుచ్చుతున్నారు. వర్షాకాలం దాటిన తర్వాత చెరువు నిండి అలుగు పారుతుండటంతో వేసవికాలంలో రామయ్య చెరువు కింద ఉన్న ఆయకట్టుకు సాగునీరందే అవకాశం తెలిపారు.

అంతరపంటలపై ఆసక్తి

- మామిడి, ఆయిల్‌పాం తోటలలో వేరుశనగ, మినుము సాగు
- లాభాలు గడిస్తున్న రైతులు



పెద్దకొత్తపల్లిలో మామిడి తోటలలో మినుము సాగు చేపట్టిన రైతు



సాతాపూర్‌లో మామిడి తోటలో వేరుశనగ పంట వేసిన రైతు

పెద్దకొత్తపల్లి: వ్యవసాయ సాగులో కాలానుగుణంగా రైతుల ఆలోచనధోరణి మారుతోంది. పాత విధానాలకు స్వస్తి పలుకుతున్నారు. నూతన ఒరవడి శ్రీకారం చుడుతున్నారు. పంటల సాగులలో అంతరపంటలను సాగు చేస్తూ లాభాలు గడిస్తున్నారు. మండలంలోని వివిధ గ్రామాలలో మామిడి, ఆయిల్‌పాం తోటలలో రైతులు అంతర పంటలు సాగు చేసి లాభాలు పొందుతున్నారు. మండలంలో 15 వేల ఎకరాలలో మామిడితోట సాగు అయ్యింది. 1000 ఎకరాలలో ఆయిల్‌పాం సాగు చేపట్టారు. మామిడి తోటలలో అంతరపంటలుగా వేరుశనగ, మినుము సాగును చేపట్టి రైతులు లాభాలు పొందుతున్నారు. అంతరపంటలుగా ఎక్కువగా సాగు చేపట్టిన గ్రామాలు సంజీవాపూర్, ముష్టిపల్లి, చంద్రకల్, వెనచర్ల, ఆదిరాల, నక్కలపల్లి, వావిల్లబావి, పెద్దకొత్తపల్లి, జొన్నలబొగుడ, సాతాపూర్, కల్వకోల్, తిరునాంపల్లి, గంట్రావ్‌పల్లి గ్రామాలు ఉన్నాయి. వేరుశనగ, మినుములు, మొక్కజొన్న, కంది అంతరపంటలుగా సాగు చేస్తూ లాభాలు గడిస్తున్నారు. ఈ ఏడాది కేఎల్‌ఐ ప్రాజెక్టుకు పూర్తిస్థాయిలో నీటి మట్టం రాకపోవడంతో మండలంలో తక్కువగా యాసంగి పంటలు వేశారు. యాసంగిలో రైతులు సాగు చేసిన పంటల వివరాలు వేరుశనగ 3064 ఎకరాలు, మినుము 2534 ఎకరాలు, వేరుశనగ 1819ఎకరాలు, మినుము 1855 ఎకరాలు అదేవిధంగా మొక్కజొన్న 20, కంది 30 ఎకరాలలో సాగు చేశారు.

లాభాలు పొందుతున్నాం..



మామిడితోటలలో అంతరపంటలుగా వేరుశనగ, మినుము పంటలు సాగు చేశా. మామిడి తోటలకు నష్టం వచ్చిన అంతరపంట వలన లాభం పొందుతున్నాం. కేఎల్‌ఐ నీరు రావడం ఎంతో ఉపయోగకరంగా ఉంది.

కురుమయ్య రైతు పెద్దకొత్తపల్లి

ఐదేళ్ల నుంచి..



ఐదేళ్ల నుంచి ఆయిల్‌పాం తోట సాగు చేస్తున్నా. అంతరపంటలుగా వేరుశనగ, మినుము పంటలు సాగు చేశాం. ఐదు సంవత్సరాల నుంచి కేఎల్‌ఐ ద్వారా సాగునీరు పుష్కలంగా అందుతోంది. దీంతో సరైన సమయంలో పంటలు చేతికి వచ్చి దిగుబడి పొందుతున్నాం.

భరత్‌గౌడ్, పెద్దకొత్తపల్లి రైతు